ఆది వారం
31-12-2023
సంపుటి - 08,
సంచిక - 420
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం


SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## మూసిన బడులను తెరిపించండి

- బడిలేని ఊరు ఉండకుండా చూడాల్సిందే
- చదువుకోసం పట్టణాలకు వెళ్లే దురవస్థ రాకూడదు
- డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించండి
- ఉమ్మడి జిల్లాకోకిల్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- విద్యాశాఖపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక నిర్ణయం



**హైదరాబాద్, డిసెంబర్ 30 సమ సమాజం):** తెలంగాణలోని పంచాయతీల్లో బడి ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బడిలేని గ్రామం ఉండరాదని అన్నారు. రాష్ట్రంలో ఎంత చిన్న గ్రామమైన, మారు మూల తాండా అయినా తప్పకుండా ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాల్సిందే. ఏ ఒక్క బాలబాలికలు చదువు కోసం ఇతర గ్రామాలకు, పట్టణాలకు పోయే పరిస్థితి ఉండొద్దు. విద్యార్థులు లేరనే నెపం తో మూసివేసిన అన్ని పాఠశాలను తెరిపించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలోమూసేసిన పాంశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. సచివాలయంలో విద్యాశాఖ సిఎం

3వ పేజీలో...

## విద్యుత్ సంస్థలను నిండా ముంచిన బిఆర్ఎస్

డిస్కంలకు 28వేలకోట్ల అప్పులు

భద్రాద్రి, యాదాద్రిల పేరుతో 50వేల కోట్లు

సింగరేణికి 19వేల కోట్ల అప్పులు

శ్వేతపత్రాల ద్వారా వివరించే యత్నం చేశాం

భద్రాద్రి ప్లాంట్‌ను పరిశీలించిన డిప్యూటి సిఎం భట్టి



**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 30 సమ సమాజం):** విద్యుత్ సెక్టార్‌ను గత ప్రభుత్వం అప్పుల ఊబిగా మార్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోమారు విమర్శించారు. ఉన్న లెక్కలను తాము నిగ్గు తేలుస్తతున్నామని అన్నారు. భద్రాచలం పవర్ ప్లాంట్‌ను ఆయన శనివారం పరిశీలించారు. బీటీపీఎస్‌ను పరిశీలించడానికి, అవగాహన చేసుకోవడానికి, రివ్యూ రూపేనా తెలుసుకున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అనంతం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని శాఖలలో అందివచ్చిన కాడికి అప్పులు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.81514 కోట్ల అప్పులు చేసిందన్నారు.

3వ పేజీలో...

## సిఎం రేవంత్‌ను కలిసిన మాజీ డిఎస్పీ నళిని

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చేయూత ఇవ్వాలని వినతి



**హైదరాబాద్, డిసెంబర్ 30 సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉద్యమకారులపై లాఠీ ఝుళిపించలేక తన ఉద్యోగానికి రాజీనామా చేసిన మాజీ డీఎస్పీ నళిని సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. శనివారం డా. బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సాధన కోసం తన ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసిన నళిని తిరిగి ఉద్యోగం ఇవ్వాలని ఇటీవలే జరిగిన పోలీసు శాఖ సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ ఆదేశించిన విషయం తెలిసిందే. తిరిగి డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వలేకపోతే అదే స్థాయిలో

3వ పేజీలో...

## సిఎం రేవంత్‌రెడ్డితో నాగార్జున దంపతుల భేటీ

పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన నాగ్



**హైదరాబాద్, డిసెంబర్ 30 సమ సమాజం):** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని నటుడు నాగార్జున తన భార్య అమల అక్కినేనితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబిలీహిల్స్‌లోని సీఎం నివాసంలో నాగార్జున దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో నెట్టింట వైరల్ అవుతున్నాయి. రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించిన సమయంలో టాలీవుడ్ నుంచి ముందుగా చిరంజీవి అభినందనలు తెలపడంతో పాటు.. ఇటీవల స్వయంగా తన ఇంటికి వెళ్లి ఆయనని అభినందించారు. మెగాస్టార్ చిరంజీవి తర్వాత రేవంత్ రెడ్డిని నాగార్జున ఇలా మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 7న సీఎంతో పాటు పలువురు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ రెండో సీఎంగా పదవీ బాధ్యతలు తీసుకున్న రేవంత్ రెడ్డికి అన్ని వర్గాల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు ఎందరో.. సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. చిరంజీవి తర్వాత నాగార్జున.. ఇలా ఒక్కొక్కరుగా పర్సనల్‌గా రేవంత్ రెడ్డిని వీలు చూసుకుని కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం కింగ్ నాగార్జున, అమల దంపతులు పుష్పగుచ్ఛంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకలపై నజర్

నగరంలో ఫ్లై ఓవర్ల మూసివేత ◆ ప్రమాదాల నివారణకు చర్యలు



**హైదరాబాద్, డిసెంబర్ 30 సమ సమాజం):** న్యూఇయర్ వేడుకల నగరంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ప్రమాదాలు జరక్కుండా చర్యలకు ఉపక్రమించారు. ఫ్లై ఓవర్లను మూసివేస్తున్నారు. డ్రంకన్ డ్రైవ్ కొనసాగుతుందని ప్రకటించారు. హోటళ్లు, పబ్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాల

3వ పేజీలో...

# అయోధ్య కోసం 550 ఏళ్లు వేచిచూశాం

## 22న ఈ కల సాకారం కాబోతోంది




- ◆ప్రారంభం రోజు ఎవరూ అయోధ్యకు రావద్దు
- ◆23నుంచి ఎప్పుడైనా సందర్శించవచ్చు
- ◆అయోధ్యను ఆధ్యాత్మిక నగరిగా తీర్చిదిద్దుతాం
- ◆22న దేశవ్యాప్తంగా దీపావళి జరుపుకోవాలి
- ◆వాల్మీకి పేరుతో విమానాశ్రయం గర్వంగా ఉంది
- ◆అయోధ్య పృటనలో ప్రధాని మోడీ వెల్లడి

**అయోధ్య, డిసెంబర్ 30 సమ సమాజం):** యావత్ ప్రపంచం అయోధ్యలో భవ్య రామాలయ ప్రారంభోత్సవం రోజు కోసం ఎదురుచూస్తోందని, జనవరి 22న జరిగి కార్యక్రమంలో పాల్గొనాలని అందరికీ ఉంటుందని, అయితే అది సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కొందరినే ఈ మహోజ్వల ఘట్టానికి ఆహ్వానించినందున ఆరోజు రావాలని అనుకోవద్దని ప్రజలను కోరారు. లాంఛనంగా రామాలయం ప్రారంభం కాగానే ఎవరికి వారు తమ వీలును బట్టి వచ్చి భగవాన్ రామ్‌ను దర్శించుకోవచ్చని సూచించారు. అయోధ్యలో ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి 15,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభించారు. పలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 22వ తేదీ చారిత్రక క్షణాల కోసం ప్రపంచం మొత్తం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోందని, సహజంగానే అయోధ్య వాసుల్లో మరింత ఎక్కువ ఉత్సాహం తొంగిచూస్తోందని అన్నారు. ఈ పుణ్య భూమిలోని అణువణువునూ తాను ఆరాధిస్తుంటానని, అందరిలాగే తాను కూడా రామమందిరం ప్రారంభమయ్యే ఘడియల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. 22న మరో దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అయోధ్యలో సుందర శ్రీరామ మందిర నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. తుది దశకు చేరుకున్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో అయోధ్యలో పర్యటించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజు జనవరి 22న దేశ ప్రజలందరూ దీపావళి జరుపుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆ రోజున సాయంత్రం ప్రతి ఇంట్లో దీపం వెలగాలన్నారు. అందుకే జనవరి 22 వ తేదీన

3వ పేజీలో...

# విప్లవ సినిమాలతో ప్రత్యేక గుర్తింపు

## నిర్మాత, దర్శకుడు,నటుడు ఆర్.నారాయణ మూర్తి ● నేడు ఆయన జన్మదినం



విజయవాడ, డిసెంబర్ 30 (సమ సమాజం): పీపుల్స్ స్టార్, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకుడు,గొప్ప నటుడిగా సుపరిచితుడైన ఆర్. నారాయణ మూర్తి సన్మదినం నేడు. సినిమాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటుడు ఆయన తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలంలోని మల్లంపేట గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో డిసెంబర్ 31, 1953లో జన్మించాడు.అమ్మ పేరు రెడ్డి చిట్టెమ్మ, నాన్న పేరు రెడ్డి చిన్నయ్య నాయడు. వీరిది అతి సాధారణ రైతు కుటుంబం. రౌతులపూడిలో 5వ తరగతి వరకు చదివాడు. రౌతులపూడిలో ఒక సినిమా థియేటర్ ఉండేది. చిన్నతనం నుండి సినిమాలలో ఆసక్తితో ఎన్టీయార్, నాగేశ్వరరావుల సినిమాలు చూసి, విరామ సమయంలో వారిని అనుకరించేవాడు. అక్కడే తన నటనా జీవితానికి పునాది పడిందని చెప్పుకున్నాడు. శంఖవరంలో ఉన్నత పాఠశాలలో చేరాడు. అక్కడే నారాయణమూర్తికి సామాజిక స్పృహ కలిగింది. సామాన్య ప్రజలకు జరిగే అన్యాయాలను గమనించి, విప్లవ ఉద్యమాలవైపు ఆకర్షితుడయ్యాడు. పెద్దాపురంశ్రీ రాజ వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ జగపతి బహద్దర్ మహారాణి కళాశాలలో బి.ఏ చదవడానికి చేరాడు. అక్కడ రాజకీయాలతో ప్రభావితుడై, సినిమాలు, రాజకీయాలు, సామాజిక బాధ్యత అనే మూడు వ్యాసంగాలపై ఇష్టాన్ని ఏర్పరచుకున్నాడు. కళాశాల ఈయన విద్యార్థిసంఘానికి అధ్యక్షుడిగానే కాకుండా కళాశాల లలిత కళల విభాగానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. అంతేకాక తను ఉంటున్న ప్రభుత్వ హాస్టలు విద్యార్థి అధ్యక్షునిగానూ, పేద విద్యార్థుల నిధి సంఘానికి కార్యదర్శి గానూ పనిచేశాడు. స్థానిక రిక్షా కార్మికులు ఈయనను మద్దతుకోసం సంప్రదించేవారు. నారాయణమూర్తి పట్టణ రిక్షాసంఘం అధ్యక్షుడుగా కూడా ఉన్నాడు. ఎమ్జ్జర్÷న్సీ కాలంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందు వలన పోలీసులు ఈయన్ను తీసుకునివెళ్ళి విచారణ కూడా చేశారు. అంతేకాక నారాయణమూర్తి సినిమా నటి మంజులతో ఒక ప్రదర్శన ఏర్పాటు చేయించి నూతన కళాశాల నిర్మాణానికి నిధుల సేకరణ ప్రారంభించాడు. అప్పట్లో బీహార్లో వరదసహాయానికి తగిన విధంగా తోడ్పాడ్డాడు. సహవిద్యార్థులు నారాయణమూర్తిని కాలేజీ అన్నగా వ్యవహరించేవారు. ఇతడిలోని కళాతృష్ణని ఎలా కనిపెట్ట గలిగారో కానీ పరిచయం కాగానే రమేష్ బాబు హీరోగా ఆయన తీస్తున్న నీడ చిత్రంలో ఇతడికి ప్రాధాన్యత ఉన్న వేషాన్నిచ్చారు. ఆ సినిమాలో నారాయణమూర్తి కొంత ప్రాధాన్యత ఉన్న నక్సలైటు పాత్ర లభించింది. సినిమా బాగా విజయవంతమై, నారాయణమూర్తి మద్రాసులోని చోళ హోటల్లో కరుణానిధి చేతులపై వంద రోజుల షీల్డు అందుకున్నాడు. ఆ తరువాత దాసరి, రామానాయుడు, జ్యోతి శేఖరబాబు వంటి దర్శకుల ప్రోత్సాహంతో అనేక సినిమాలలో సహాయపాత్రలలో నటించాడు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో నారాయణమూర్తి పూర్తిస్థాయి హీరోగా సంగీత అనే సినిమా తీశాడు. ఈ చిత్రాన్ని పూర్ణాపిక్చర్స్ పతాకంపై హరగోపాల్ నిర్మించాడు. అందులో రెండు పాటలను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడాడు. చిత్రం ఒక మోస్తరు విజయం సాధించి 50 రోజులపాటు ఆడింది. అయితే ఆ తర్వాత హీరోగా అవకాశాలు రాలేదు, చిన్నవేషాలకు కూడా తీసుకోక బాగా కష్టాలను ఎదుర్కొన్నాడు. తిండికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలోనే హీరో అవ్వాలంటే మొదట దర్శకునిగా నిలదొక్కుకోవాలని అనుకున్నాడు.దర్శకునిగా పూర్వానుభవం లేకపోవటం వలన, ఎవరూ సినిమా తీసే అవకాశం ఇవ్వలేదు. షూటింగులు ఉన్నప్పుడల్లా దాసరి పనితీరును గమనిస్తూ ఉండేవాడు. దర్శకునిగా తనకు తాను అవకాశమిచ్చుకోవటానికి తనే నిర్మాత అయితే కానీ కుదరదని గ్రహించి, స్నేహితులకు తన ఆశయం తెలియజేయగా, వాళ్లు కొంతమంది నారాయణమూర్తి సినిమా నిర్మించడానికి సహాయం చేశారు. అందుకే తన బ్యానరుకు 'స్నేహ చిత్ర' అని పేరు పెట్టుకున్నాడు. భారత-రష్యా స్నేహ కరచాలనాన్ని చిహ్నంగా ఎంచుకున్నాడు. నారాయణమూర్తి నిర్మాత, దర్శకుడిగా తన మొదటి సినిమా అర్ధరాత్రి స్వతంత్రం చిత్రీకరణను 1984 జూన్ 10న రంపచోడవరంలో ప్రారంభించాడు. ఆ సినిమా పదహారున్నర లక్షల పెట్టుబడితో పూర్తయింది. సెన్సారుతో వచ్చిన చిక్కులను కొంతమంది వ్యక్తుల సహకారంతో అధిగమించి సినిమాను 1986, నవంబరు 6, టి.కృష్ణ వర్ధంతి రోజున విడుదల చేశాడు. ఆ సినిమాలోనారాయణమూర్తి ఒక నక్సలైటు పాత్రను పోషించాడు. ఈ సినిమా ఊహించినంతగా విజయవంతమై చరిత్ర సృష్టించింది. ఈ సినిమా విజయవంతమవటానికి వంగపండు ప్రసాదరావు వ్రాసిన పాటలు, పి.ఎల్.నారాయణ సంభాషణలు, నారాయణమూర్తి కథ, చిత్రానువాదము, దర్శకత్వం ఎంతగానో దోహదం చేశాయి. నారాయణమూర్తి సినిమాలన్నీ సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తంగా తీసినవే. ఈయన చిత్రీకరించిన సినిమాల్లో నిరుద్యోగం, ప్రపంచ బ్యాంకు విధానాలు, డబ్ల్యూటీవో ఒప్పందం, తృతీయ దేశాల సమస్యలు, పర్యావరణ సమస్యలు, ఆనకట్టలు, నిర్వాసితుల సమస్యలు, భూ సమస్యలు, రాజకీయ అతలాకుతలాలు మొదలైనటువంటి వాటికి అద్దంపట్టాడు. అందువలన బాధిత ప్రజలు ఈయన సినిమాలలోని పాత్రలలో మమేకమైపోయేవారు.ఆ తరువాత వచ్చిన సినిమాలలో దండోరా సినిమా సారా వ్యతిరేక ఉద్యమం చేపట్టడానికి మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ఎర్రసైన్యం భూపోరాటానికి అజ్యం పోసింది. చుండూరు సంఘటనను చిత్రీకరించిన లాల్ సలాం పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఆ సినిమా తీసినందుకు పోలీసులు నారాయణమూర్తిని విచారణ చేశారు. కొన్నాళ్ళు ఆ సినిమాను నిషేధించారు కూడాను. నారాయణమూర్తి సినిమాల్లో ద్వందార్థ సంభాషణలు, పెద్ద పెద్ద సెట్టింగులు, పేరుమోసిన నటీనటవర్గం, ప్రత్యేక హాస్య సన్నివేశాలు, యుగళగీతాలు మొదలైనవి ఉండవు. వాస్తవ సమస్యలను చిత్రీకరించి సామాన్యప్రజల మనసులను ఆకట్టుకోవటం మీదే ఆధారపడిన సినిమాలవి.2009 మార్చి వరకు నారాయణమూర్తి కథానాయకునిగా నటించిన 26 సినిమాలలో 10 సినిమాలు విజయవంతమయ్యాయి. అవి విడుదలైన క్రమంలో - అర్ధరాత్రి స్వతంత్రం, అడవి దీవిటీలు, లాల్సలాం, దండోరా, ఎర్రసైన్యం, చీమలదండు, దళం, చీకటి సూర్యులు, ఊరు మనదిరా, వేగుచుక్కలు. నారాయణమూర్తి ఏ ఆడంబరాలు లేకుండా సాధారణ జీవితం గడపటానికి ఇష్టపడతాడు. అవివాహితుడైన నారాయణమూర్తిని ఎందుకు పెళ్ళిచేసుకోలేదని ఎవరో గతంలో ప్రశ్నిస్తే, అదంత చర్చించదగ్గ అంతర్జాతీయ సమస్యేమీకాదని దాటవేశాడు. తన జీవిత భాగస్వామి తన ప్రజాజీవితానికి ఎక్కడ అడ్డువస్తుందో అనే అనుమానంతో పెళ్ళి చేసుకోలేదట. సినీ దర్శకనిర్మాతగా 19 సినిమాలను తీసి, 25 సినిమాలలో నటించి ఎంతో ఎత్తుకు ఎదిగినప్పటికీ, ఈయనకు సొంత ఇల్లు కానీ, సొంత కారు కానీ లేవు.

ఈయనకు తెలుగుదేశం పార్టీ రెండుసార్లు కాకినాడ లోక్సభ స్థానం, కాంగ్రెస్ పార్టీ తుని అసెంబ్లీ సీటు ఇవ్వజూపినా, రాజకీయాలలో ప్రవేశించే ఉద్దేశం లేకపోవటం వలన తిరస్కరించాడు.నారాయణమూర్తి కి అంటరానితనం దుర్మార్గంవంటివి ఇష్టం ఉండవు.బర్త్ డే లు, మదర్స్ డే లు, ఫాదర్స్ డేలు జరుపుకోవటం నచ్చవు.పునర్జన్మ, స్వర్గం, నరకం, ఖర్మ సిద్ధాంతం నమ్మడు.ఏడిస్తేనే నీ కష్టాలు తొలుగుతాయనుకుంటే ఏడువు అన్న బుద్ధుడి సూక్తి నచ్చి ఏడుపు మానాను.కారల్ మార్క్స్ అంతటి వారు కూడా దేవుడు లేడని చెప్పలేదు. నేను భారతీయుణ్ణి. ముఖ్యంగా హిందువుని. ఆ సంప్రదాయాల మధ్య పుట్టి పెరిగిన వాణ్ణి. చెట్లలో, పుట్టలలో, గట్టులలో చివరకు విష సర్పాల్లో కూడా దైవాన్ని చూసే గొప్ప సంస్కృతి మనది. ఆ సంస్కృతిని ఆకళింపు చేసుకున్నాను కాబట్టే నాకు దేవుడంటే నమ్మకం.సాధారణమైన జీవితం గడపడానికి కారణం నా 'మెంటాలిటీ'. చిన్నప్పట్నుంచీ నేను ఇంతే. నా అభిరుచుల్ని, అభిప్రాయాల్ని, మనోభావాల్ని మార్చుకోలేని అశక్తుణ్ణి. పదిమందీ నన్ను చూసి గొప్పగా చెప్పుకోవాలని నేను ఇలా ఉండను. ఇలా బతకడమే నాకిష్టం. నా రూమ్లో చాప, దిండు మాత్రమే ఉంటాయి.. వేప పుల్లతో పళ్లు తోముకుంటా. సబ్బుతో స్నానం చేయను. మొహానికి పౌడర్ రాయను. నా స్వభావం ఇది. చెట్లకింద కూర్చోడం, జనంతో మమేకమవ్వడం.. ఇవే నాకు ఆనందాన్నిచ్చేవి. ఎవరో ఏదో అనుకుంటారని నా స్వభావాన్ని మార్చుకోలేను. మా గురువుగారు నన్ను 'పీపుల్స్ స్టార్' అన్నారు. 'జననాట్యమండలి గజ్జ ఆగిన చోట... ప్రజల గళాన్ని వినిపిస్తున్నాయి నారాయణమూర్తి సినిమాలు' అన్నాడు గద్దరన్న. స్వదేశీ భారతి అనే ప్రఖ్యాత బెంగాలీ రచయిత ఆయన రాసిన 'ఆరణ్యక్' బుక్పై ముఖచిత్రంగా నా బొమ్మ వేశాడు. పూరిజగన్నాథ్ తన 'కెమెరామెన్ గంగతో రాంబాబు' చిత్రాన్ని నాకు అంకితమిచ్చాడు. నాకు ఈ తృప్తి చాలు.పెళ్లి విషయంలో కూడా నాకంటూ కొన్ని కచ్చితమైన అభిప్రాయాలుండేవి. దానికి పెద్దలు ఒప్పుకోలేదు. నేను అభిప్రాయం మార్చుకోలేదు. చివరకు ఒంటరిగా మిగిలిపోయా.దేవుడు నన్ను అన్ని విషయాల్లో కింగ్ని చేసి ఆ ఒక్క విషయంలో అన్యాయం చేశాడు. ఇంటికెళ్లగానే.. ఒంటరితనం కమ్మేస్తుంది. జ్వరం వచ్చినప్పుడు పలకరించే నాథుడు లేకుండా ఒంటరిగా ముడుచుకొని పడుకొని ఉంటాను. తోడులేని నా జీవితం కూడా ఓ జీవితమేనా. ఏ గోంగూరో, లేక చేపల పులుసో తినాలనిపించినప్పుడు, అవి హోటల్లో దొరకనపుడు... అదే నాకంటూ ఓ భార్య ఉంటే వండి పెట్టేది కదా అనిపిస్తుంది. మేం సెటిల్ అవ్వలేదు. అయ్యాక పెళ్ళి చేసుకుంటాం అనే ధోరణి మానండి. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. చక్కగా పెళ్ళి చేసుకోండని పిలుపునిచ్చారు.పేరుప్రఖ్యాతుల కోసం మాత్రమే జీవించేవాడికి మానసిక శాంతి ఉండదని ఆయన గతంలో పేర్కొన్నారు.

# ఆధునీకరించిన అయోధ్య స్టేషన్

**అయోధ్యధామ్ రైల్వే స్టేషన్ ప్రారంభం**

**యోగితో కలసి ప్రారంభించిన ప్రధాని మోడీ**

**రోడ్షోతో ఆకట్టుకున్న ప్రధాని**



అయోధ్య, డిసెంబర్ 30 (సమ సమాజం): అయోధ్య రైల్వే స్టేషన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సిఎం యోగి ఆదిత్యనాథ్తో కలసి ప్రధాని మోడీ ప్రారంభించారు. అలాగే పలు రైళ్లకు కూడా పచ్చజెండా ఊపారు. ఇప్పటికే ఉన్న స్టేషన్కి కొత్త హంగులు అద్ది మరింత అందంగా తీర్చి దిద్దారు. దీనికి అయోధ్య ధామ్ జంక్షన్ అని నామకణం చేవారు. దీనిని ఆధునీకరించేందుకు ప్రభుత్వం రూ.240 కోట్లు ఖర్చు చేసింది. లిఫ్టులు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్స్, క్లాక్రూమ్స్తో పాటు ఫుడ్ ఎ÷-లాజాలు ఏర్పాటు చేసింది. రామ మందిర ఆకృతిలోనే స్టేషన్ని తీర్చి దిద్దారు. ఆ తరవాత యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్తో కలిసిస్టేషన్ని పరిశీలించారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీకి ఎయిర్పోర్ట్లో స్వాగతం పలికారు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్ కూడా ఉన్నారు. రైల్వే స్టేషన్కి చేరుకునే క్రమంలో ప్రధాని మోదీ మెగా రోడ్ షో నిర్వహించారు. ఆయన అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని దారి పొడవునా ఆయనకు అభివాదం చేశారు. ఇదే స్టేషన్లో ఆరు వందేభారత్ రైళ్లతో పాటు, రెండు అమృత్ భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. పుష్పుల్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ రైళ్లు ఇప్పటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. రైల్వే స్టేషన్ని మొత్తం మూడు అంతస్తుల్లో నిర్మించారు. వందేభారత్ రైల్ని ప్రారంభించిన తరవాత ఆ ట్రైన్లో ఎక్కారు ప్రధాని మోదీ. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ స్టేషన్లో ఇంకెన్నో ప్రత్యేకతలున్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేకంగా వసతులు అందుబాటులో ఉన్నాయి. సిక్రూమ్ కూడా నిర్మించారు. టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్నీ ఏర్పాటు చేశారు. స్టేషన్ టాప్ ఫ్లోర్ని రాముని విల్లు ఆకారంలో నిర్మించారు. అంతే కాదు. ఇందులో ఎయిర్ పోర్ట్ తరహా వసతులు కల్పించారు. ట్యాక్సీ బే కూడా ఉంది. అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం పర్యటిస్తున్న సందర్భంగా అయోధ్య లో ఆధునిక హంగులు, రామమందిర చిత్రాలతో పునరుద్ధరించిన అయోధ్య రైల్వేస్టేషన్ను ప్రధాని ప్రారంభించారు. ఆయన వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఉన్నారు. రైల్వే స్టేషన్ విశేషాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రధానికి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ రెండు అమృత్ భారత్, ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు అమృత్ భారత్ రైల్లోకి వెళ్లి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. పర్యటనలో భాగంగా అయోధ్యలోని మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభిస్తారు. అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ నాన్ ఏసీ రైలు పుష్-పుల్ రైలు. ముందూ వెనుక ఇంజిన్లు ఉంటాయి. దీనివల్ల తక్కువ సమయంలోనే రైలు వేగాన్ని అందుకోవడం తోపాటు, ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఇందులో 22 కోచ్లు ఉంటాయి. 12 సెకండ్ క్లాస్ త్రీటైర్ స్లీపర్ కాగా.. 8 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్లు, రెండు గార్డు కంపార్ట్మెంట్స్ ఉంటాయి. ఈ 2 కంపార్ట్మెంట్లలోనే కొంత భాగాన్ని మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ రైళ్లు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఉదయం అయోధ్య చేరుకున్న ప్రధానికి రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్పోర్టు నుంచి ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వరకు 15 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్ షోలో దారి పొడవునా ప్రధానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మధ్య మధ్యలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,400 మంది కళాకారులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

# ప్రభుత్వం నడపడం చేతకాక అప్పులు అంటారా

## మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, డిసెంబర్ 30 (సమ సమాజం): ప్రభుత్వం నడపడం చేత గాక అప్పులు అని మాట్లాడుతున్నారని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కీలక నేత, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇరవై రోజులు దాటిందని, సీఎం హామీ ఇచ్చినా పనులు చేయకుండా అప్పులయ్యాయని ప్రతి రోజూ ఒకటే పాట పాడుతున్నారని విమర్శించారు. పథకాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, పని చేయకుండా అప్పులంటూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాము అప్పులు, ఆస్తుల వివరాలు ప్రజల ముందు ఉంచామని, దేశంలో అప్పులు లేని రాష్ట్రం లేదని ఆయన ప్రస్తావించారు. కేంద్రం కూడా అప్పులు చేసిందనే విషయం అందరికీ తెలుసన్నారు. నిన్నటి వరకు కాంగ్రెస్ పాలించిన రాజస్థాన్లో విద్యుత్ సంస్థలు రూ.53 వేల కోట్ల అప్పుల్లో ఉన్నాయి. ప్రభుత్వం నడపడం చేత గాక అప్పులు అని మాట్లాడుతున్నారు. భట్టికి చేతనైతే రాజస్థాన్, కర్ణాటక, చత్తీస్గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల లెక్కలు తెప్పించుకొండి. అన్ని రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నాయి. 24 గంటల విద్యుత్ ఇవ్వడం తెలియక తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. భట్టి సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నారు. ఇప్పటికీ దేశంలో 39 విద్యుత్ ఎ÷-లాంట్స్ సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నడుస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో చేసిన అప్పే ఇప్పుడు రూ.88 వేల కోట్లకు పెరిగింది. కాంగ్రెస్ వచ్చింది కరెంట్ కష్టాలు మొదలయ్యాయి అని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. 2017 లోపు పూర్తి చేసే ప్రాజెక్టులకు సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడొచ్చని చట్టంలో ఉంది. మీరు పాలించిన రాష్ట్రాల్లో లంకె బిందులు ఉన్నాయా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 24 గంటల కరెంట్ రావడం లేదని భట్టి అసెంబ్లీలో ఎందుకు మాట్లాడలేదు. ఎక్కువ రోజులు అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడపలేరు. ఇచ్చిన పాలనపై దృష్టి పెట్టండి హామీలు నెరవేర్చండి. అభయ హస్తం దరఖాస్తు ఫారంలో బ్యాంక్ అకౌంట్ ఎందుకు అడగలేదు?. తెల్ల రేషన్ కార్డు లేకపోతే ఏమి ఇవ్వమని ముందే ఎందుకు చెప్పలేదు?. కార్లు కొన్నారని చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. కార్లు షెడ్డులో ఉండక పోతే రోడ్ల మీద ప్రదర్శన పెడతారా?' అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

# ప్రజాపాలన దఖాస్తుల అమ్మకాలపై రేవంత్ సీరియస్

**అవసరమైనన్ని అందుబాటులో ఉంచాలని సిఎం ఆదేశం**



హైదరాబాద్, డిసెంబర్ 30 (సమ సమాజం): ప్రజాపాలన దరఖాస్తుల అమ్మకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారికి ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తుదారులకు అవసరమైనన్ని దరఖాస్తులను అందుబాటు లో ఉంచాల్సిందే నని అధికారులను ఆదేశించారు. రైతుబంధు, పింఛన్లపై అపోహలకు గురి కావద్దని, పాత లబ్దిదారులందరికీ యథావిధిగా ఈ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. గతంలో లబ్ది పొందని వారు, కొత్తగా లబ్ది పొందాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని సీఎం అన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురి కావద్దని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల సరళి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలు, దరఖాస్తుల వివరాలు, ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానం, ప్రజల్లో స్పందనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత లేకుండా అవసరమైనన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. దరఖాస్తులను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు విధిగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన క్యాంపుల్లో దరఖాస్తుదారులకు తాగునీరు, సరైన నీడ కోసం టెంట్లు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని అధికారులకు మరోసారి స్పష్టంగా సూచించారు

# ఆరుకోట్లు దాటిన మహిళల ఉచిత ప్రయాణం

**80 కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్,డిసెంబర్ 30 (సమ సమాజం): ఇప్పటివరకు మహాలక్ష్మి పథకం ద్వారా 6 కోట్ల మహిళలు ప్రయాణిం చారని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ సంస్థను కాపాడుకోవడం, కార్మికుల సంక్షేమం తమ ప్రభుత్వం ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద 80 కొత్త బస్సులనుమంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని సంచలన నిర్ణయం తీసుకున్నామున్నారు. అన్ని బకాయిలు విడతాలవారిగా చెల్లిస్తామన్నారు. 100 శాతం ఆక్యుపెన్సీ దాటిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తా మన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగకుండా మహిళలకు రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ నష్టాలను తొలగించేందుకు తాను చొరవ తీసుకుంటానని.. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి 1000 ఎలెక్టిక్ర్ బస్సులు ప్రారంభిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకానికి మంచి రెస్పాన్స్ వస్తోందని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు టీఎస్ఆర్టీసీ కృషి చేస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.400 కోట్ల వ్యయంతో అధునాతనమైన 1050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందులో 400 ఎక్స్ ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులున్నాయన్నారు. పర్యావరణ హితమైన ఎలక్టిక్ర్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 బస్సులను వాడకంలోకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తెస్తోందని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టీఎస్ఆర్టీసీ ఎండి సజ్జనార్, సీపీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్కు అభినందనలు

## బాలకృష్ణ, పివి సింధు తదితరుల భేటీ



హైదరాబాద్, డిసెంబర్ 30 (సమ సమాజం): శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలువురు కలిసి అభినందనలు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పలువురు సీపీఎం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈసందర్భగా సిఎం వారిని ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు, టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఇతర బసవతారకం ఆస్పత్రి వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. సిఎంకు పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. అలాగే ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కూడా సిఎంను తల్లిదండ్రులతో కలసి బినందించారు. ఇకపోతే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రులు నారాయణస్వామి, వైద్యలింగం, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసారు.

# రాజీనామా వార్తలు అబద్ధం

**నిరాధా వార్తలు ప్రచారం చేయొద్దన్న తమిళసై**

హైదరాబాద్, డిసెంబర్ 30 (సమ సమాజం): తెలంగాణ గవర్నర్గా తాను సంతోషంగా ఉన్నానని గవర్నర్గా రాజీనామా చేసున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని తమిళిసై సౌందర్ రాజన్ స్పష్టం చేశారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయొద్దు అని గవర్నర్ హెచ్చరించారు. ఏదైనా నిర్ణయం ఉంటే అన్ని విషయాలు తెలియజేస్తానని? రాజకీయాలు అనేవి తన కుటుంబ నేపథ్యంలోనే ఉన్నాయని ఆమె వివరించారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ? వచ్చే లోక్సభ ఎన్నికల్లో పోటీ కోసమే హస్తినకు వెళ్లారనే వార్తలు జోరందుకున్నాయి. తమిళిసై సౌందరరాజన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారనీ, సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి ఆమె పోటీ చేసేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలన్నీ అవాస్తవాలని తమిళిసై స్పష్టం చేశారు.

# విద్యుత్ సంస్థలను నిండా ముంచిన బీఆర్ఎస్



(మొదటి పేజి తరువాయి) ప్రభుత్వం నుండి డిస్కంలకు రూ.28000 కోట్ల బకాయి పడి ఉన్నామన్నారు. తాము ఉంటేనే కరెంట్ సాధ్యం అని చెప్పిన గత ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిందన్నారు. విద్యుత్ కొనడానికి 30 వేలకోట్ల రూపాయల 59580 కోట్ల పవర్ పరిచేజ్ మీద అప్పు చేసిందన్నారు. రాష్ట్ర విబజన నాటికి రూ.7250 కోట్ల బకాయి మాత్రమే ఉందన్నారు. యాదాద్రి పవర్ ప్రాజెక్ట్‌కు రూ.50,000 కోట్ల అప్పు ఉందన్నారు. వాస్తవాలు అన్నీ కూడా అసెంబ్లీలో శ్వేతపత్రం ద్వారా విడుదల చేశామన్నారు. అప్పుల నుంచి విముక్తులై గాడిలో పెట్టడానికి నిరంతరం శ్రమిస్తున్నామని, సమీక్షిస్తున్నామని ,గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇవన్నీ గాలి లెక్కలు కాదని చెప్పుకొచ్చారు. ఉన్నరికార్డ్స్ ప్రకారం అందిస్తున్నట్లు తెలిపారు. పవర్ సెక్టార్‌ను గత ప్రభుత్వం పీకలదాకా ముంచేయగా.. ఈ ప్రభుత్వం ఈ అప్పుల నుంచి బయటపడటానికి ప్రయత్నం చేస్తుందన్నారు. బీటీపీఎస్ సూపర్ క్రిటికల్ టెక్నాలజీ వాడుకొని పర్యావరణానికి హని కలుగకుండా మేధావుల సూచనల మేరకు ముందుకు వెళ్తామన్నారు. ఇప్పుడున్న బీటీపీఎస్ వలన చాలా ఇబ్బందులు ఉన్నాయని...దీనిని అధిగమించే ప్రయత్నం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. గత ప్రభుత్వం ప్రతి శాఖను అప్పుల్లో ముంచిందని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ కొనుగోలు కోసం భారీగా అప్పులు చేసి వెళ్లారని మండిపడ్డారు. ప్రస్తుతం విద్యుత్ కొనుగోలు కింద రూ.59,580 కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్నాయన్నారు. 'భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ , యాదాద్రి పవర్ స్టేషన్ పెడుతున్నామంటూ భారీగా అప్పులు చేశారు. రాష్ట్రాన్ని భయంకరమైన స్థితికి తెచ్చారు. అందుకే అసెంబ్లీలో శ్వేత పత్రాలు విడుదల చేసి కొంత మేర వాస్తవాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఓ ప్రణాళిక, ముందుచూపుతో అడుగులు వేయాల్సి ఉంది. ప్రతి శాఖలోనూ తాజా పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల వద్దకు వెళ్లి పరిస్థితులు తెలుసుకుంటున్నామని తెలిపారు. తమతోనే కరెంట్ అని చెప్పి గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖను అప్పుల్లోకి నెట్టారని సింగరేణికి రూ.19 వేల కోట్లు బకాయి పడ్డారని భట్టి తెలిపారు. అన్ని ప్రాజెక్టులను సందర్శించి వాటిపై సమగ్ర సమాచారం సేకరించి ప్రజల ముందుకు తెస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.81,514 కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వం నుంచి డిస్కంలకు రూ.28 వేల కోట్ల బకాయి పడి ఉన్నామని వివరించారు. యాదాద్రి పవర్ ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్ల అప్పు ఉందని అన్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సూపర్ క్రిటికల్ టెక్నాలజీ వాడుకొని పర్యావరణానికి హాని కలగకుండా నిపుణుల సూచనలతో ముందుకు వెళ్తామన్నారు.

# మూసిన బడులను తెరిపించండి



(మొదటి పేజి తరువాయి) అధికారులతో రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ....తెలంగాణలో బడి లేని పంచాయతీ ఉండొద్దన్నారు. ఎంతమంది పిల్లలున్నా ప్రభుత్వ పాఠశాలను నడపాల్సిందేనని రేవంత్రెడ్డి ఆదేశించారు. దీనికోసం వెంటనే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను భర్తీకి చర్యలను తీసుకోవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడానికి డిఎస్సీ నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఊరు, మన బడి కార్యక్రమంలో జరిగిన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంకా మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలల్లో ఉన్న అవాంతరాలపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బదిలీల అంశంలో ఉన్న అవాంతరాలను, అభ్యంతరాలను అధిగమించడానికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. విద్యాలయాలకు విద్యుత్తు బిల్లులకు సంబంధించి కేటగిరి మార్పునకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ సూచనలను చేశారు. విద్యాలయాలకు వ్యాపార, పారిశ్రామిక కేటగిరి కింద బిల్లులు వసూలు చేయడంపై తగిన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. పాఠశాలల్లో స్వీపర్లు, పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయడానికి ఉన్న మార్గాల గురించి అధికారులను తగిన ఆదేశాలను జారీ చేశారు. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విద్యాశాఖకు చెందిన పలు అంశాలపై నేడు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రో.లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యా శాఖ దేవసేన, సీఎంఓ అధికారులు శేషాద్రి, షా-నవాజ్ కాసీం తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రారిశ్రామిక అవసరాలకు కావాల్సిన నైపుణ్యంగల ఉద్యోగాలను సాధించే విధంగా ఈ స్కిల్ యూనివర్సిటీలు ఉండాలని అన్నారు. వీటిలో ఉపాధి ఆధారిత స్వల్పకాల, దీర్ఘకాల కోర్సులను ప్రవేశ పెట్టాలని పేర్కొన్నారు. ఈ విషయంలో గుజరాత్, హర్యానా, రాజస్థాన్, ఒరిస్సా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ఈ విధమైన స్కిల్ యూనివర్సిటీలని అధ్యయనం చేయాలని సూచించారు. కొడంగల్ నియోజక వర్గంతో పాటు తొమ్మిది జిలాల్లో ఈ స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు గాను, విద్యా శాఖ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కమిటీ వేసి తగు ప్రతిపాదనలను సమర్పించాలని సీఎస్‌ను ఆదేశించారు.



# సీఎం రేవంత్‌ను కలిసిన మాజీ డీఎస్పీ నళిని

(మొదటి పేజి తరువాయి) మరేదైనా ఉద్యోగం ఇచ్చే అంశంపైనా ఆలోచించాలని సూచించారు. అవసరమైతే తనను కలిసేందుకు నళినికి అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యం లోనే నళిని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలిపారు. కాగా ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్న ఆమె సీఎంకు కొన్ని పుస్తకాలు అందించారు. నళిని మాత్రం తిరిగి ఉద్యోగంలో చేరేందుకు సుముఖంగా లేరు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తరవాత మాజీ డీఎస్పీ నళిని మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిని కలవడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు తనకు ఉద్యోగం అవసరం లేదని స్పష్టం చేశారు. డబ్బు, భౌతిక ప్రపంచం నుంచి బయట పడ్డాను? ఇప్పుడు తనది ఆధ్యాత్మిక మార్గమని తెలిపారు. వేద కేంద్రాలకు ప్రభుత్వ సహకారం అడిగాను.. సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే వేదం, యజ్ఞం పుస్తకాలు పూర్తి చేస్తున్నా. సనాతన ధర్మ ప్రచారానికి పనిచేస్తా.. గతంలో నేను, తోటి ఉద్యోగులు.. డిపార్ట్‌మెంట్‌లో ఎదుర్కొన్న సమస్యలపై సీఎంకు రిపోర్ట్ ఇచ్చానని తెలిపారు. తనలా ఎవరూ బాధపడవద్దన్నదే తన అభిప్రాయమన్నారు. ఇప్పుడు బ్యూరొక్రసి మీద నమ్మకం పోయింది? అందుకే ఆధ్యాత్మిక బాటలో నడుస్తున్నా.. నాకు జరిగిన అన్ని విషయాలు.. సీఎం దృష్టికి తీసుకెళ్లాను. నా మనసుకు నచ్చిన సేవ చేస్తున్నాను. ఇన్నాళ్ల నా మనోవ్యధను ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషంగా ఉందని నళిని తెలిపారు. గతంలో ఆమె రెండు సార్లు సోషల్ మీడియాలో స్పందించారు. జీవితంలో సర్వస్వం కోల్పోయిన తాను.. ఇప్పుడు మరో మార్గం ఎంచుకున్నానని దేవుడి దయ వల్ల నా జీవితంలోకి మహర్షి దయానంద సరస్వతి ప్రవేశించాడని చెప్పుకొచ్చారు. వేదమాత, యజ్ఞ దేవతలు నాలో తిరిగి ప్రాణం పోశారని అందుకే నేను నా జీవితాన్ని ఆ మహనీయుని చరణాలకు సమర్పించుకున్నానన్నారు. వేద ప్రచారకురాలిగా, వైదిక యజ్ఞ బ్రహ్మగా సనాతన ధర్మాన్ని ప్రచారం చేయడమే నా ముందున్న కర్తవ్యం. ఉద్యోగం అవసరం లేదు కానీ ధర్మ ప్రచారానికి ఉపయోగ పడేలా ఏదైనా సహాయం చేస్తే స్వీకరిస్తాన్నారు. ఆ సాయం కోసం ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. నళిని తెలంగాణ ఉద్యమ సమయంలో డీఎస్పీగా ఉన్నారు. ఉద్యమంలో భాగంగా ఉద్యమానికి రాజీనామా చేశారు. తర్వాత రోశయ్య హయాంలో ఉద్యోగం ఇచ్చినా అనేక రకాల వేధింపులకు గురి కావడంతో రాజీనామా చేశారు. తర్వాత బీజేపీలో చేరారు కానీ.. రాజకీయంగా కూడా కలసి రాకపోవడంతో ఆమె అధ్యాత్మిక మార్గంలోకి వెళ్లారు. రేవంత్ సీఎం అయ్యాక ఉద్యమకారులందరూ ఆమెను గుర్తు చేసుకోవడంతో మళ్లీ వెలుగులోకి వచ్చారు. అధ్యాత్మక మార్గంలో ఉన్నట్లుగా అందరికీ వివరించారు.

# న్యూ ఇయర్ వేడుకలపై నజర్



(మొదటి పేజి తరువాయి) వినయోగం జరక్కుండా నిఘా పెట్టారు. మఫ్టీల్లో అనుసరిస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో డ్రగ్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన పోలీసులు భారీగా తనిఖీలు చేపట్టారు. కొత్త సంవత్సర వేడుకల్లో పబ్బులపైనా నిఘా పెట్టారు. ఈవెంట్లకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్న ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్.. డ్రగ్స్ పై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నారు. 31న రాత్రి ఈవెంట్లలో డ్రగ్స్ సరఫరా అయ్యే అవకాశం ఉందని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ నిఘా పటిష్టం చేసింది. పర్మిషన్ ఇచ్చిన ఈవెంట్ల దగ్గర టాస్క్‌ఫోర్స్ నిఘా పెంచుతున్నారని సమాచారం. అయితే వేల సంఖ్యలో పర్మిషన్లు ఇస్తుండడం, ఆ స్థాయిలో సిబ్బందిని నియమించే పరిస్థితి లేదన్న వాదనలు ఉన్నాయి. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పబ్‌లు, ఇతర బార్లపైనే ప్రధానంగా దృష్టి పెడుతున్నది. ఇకపోతే మద్యం అమ్మకాలు పెరిగే అవకాశం ఉంది. 31న నైట్ పార్టీలు నిర్వహించేందుకు ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థలకు ఎక్సైజ్ శాఖ పర్మిషన్ ఇస్తోంది. మరోవైపు ఈవెంట్లలో లిక్కర్ వినియోగంపైనా వివరాలు తీసుకుంటోంది. మొత్తంగా పోలీస్ శాఖ నేటినుంచి జనవరి 1 వరకు అప్రమత్తంగా ఉందని పోలీస్ అధికారులు తెలిపారు.

# అయోధ్య కోసం 550 ఏళ్లు వేచిచూశాం

(మొదటి పేజి తరువాయి) అయోధ్యలో ఉండే రద్దీ కారణంగా భక్తులు ఎవరూ అయోధ్యకు రావొద్దని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆ తర్వాతి రోజు అంటే జనవరి 23 వ తేదీ నుంచి జీవితాంతం శ్రీరాముడిని దర్శించుకోవచ్చని మోదీ సూచించారు. ప్రజలు ఎవరూ అయోధ్యకు వచ్చి ఇబ్బంది పడకూడదనే ఈ సూచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో ఆధునిక హంగులతో పునరుద్ధరించిన రైల్వేస్టేషన్ తోపాటు మహర్షి వాల్మీకి ఎయిర్‌పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితమిచ్చారు. రెండు అమృత్ భారత్ రైళ్లు, ఆరు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన జనవరి 22న అయోధ్యకు రావద్దని ప్రజలను కోరారు. మీరు 550 సంవత్సరాలకు పైగా వేచి ఉన్నారు, మరికొంత కాలం వేచి ఉండండి అంటూ పిలుపునిచ్చారు. కాగా ఆశ్వయుజ మాసంలోని అమావాస్య రోజున లంకను జయించి.. సీతాదేవితో కలిసి శ్రీ రాముడు అయోధ్య కు తిరిగొచ్చాడని అంటారు. రామయ్య రాకను స్వాగతిస్తూ అయోధ్య ప్రజలు దీపాలు వెలిగిస్తారట. ప్రస్తుతం రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో మోదీ ఈ మేరకు పిలుపునిచ్చారు. శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట తరువాత, తమ సౌలభ్యం ప్రకారం అయోధ్యకు రావాలని సూచించారు. జనవరి 22న ఇక్కడికి రావడానికి తమ మనస్సును మార్చుకోకండి అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ మహత్తర కార్యక్రమానికి సన్నాహాలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయని, ఇందులో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రధాని మోదీ అన్నారు. గుడి ఎక్కడికీ వెళ్లదు కాబట్టి ఇక్కడ రద్దీగా ఉండకండి. ఇది శతాబ్దాల పాటు కొనసాగుతుంది. ఈ వేడుకకు కొందరికే ఆహ్వానం అందిందని ప్రధాని తెలిపారు. అందుచేత ఆహ్వానించబడిన వారు మాత్రమే అయోధ్యకు రావాలన్నారు. జనవరి 23వ తేదీ తర్వాత ప్రతి ఒక్కరికి ఆయోధ్య ప్రయాణం సులువవుతుందన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం అదృష్టవశాత్తూ మనందరి జీవితాల్లోకి వచ్చిందని, ఈ సందర్భంగా 140 కోట్ల మంది దేశప్రజలు జనవరి 22న తమ ఇళ్లలో శ్రీరామజ్యోతిని వెలిగించి దీపావళిని జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా, అయోధ్య నగరాన్ని పరిశుభ్రంగా మార్చాలని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. అయోధ్య ఇప్పుడు లక్షలాది మంది సందర్శకులకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నిత్యం సందర్శకులు ఇక్కడికి వస్తూనే ఉంటారు. అయోధ్యను దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మార్చేందుకు అయోధ్య ప్రజలు ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. డిసెంబర్ 30వ తేదీ భారతదేశ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా ఉండిపోతుందని, ఇండియా ఫ్రీడం ప్రకటన చేస్తూ నేతాజీ సుభాస్ చంద్రబోస్ 1943లో ఇదేరోజు అండమాన్‌లో భారతదేశ పతాకాన్ని ఆవిష్కరించారని గుర్తు చేశారు. ప్రపంచంలోని ఏదేశమైనా అభివృద్ధిలో పతాక స్థాయికి చేరుకోవాలనుకుంటే ఆ దేశవారసత్వ సంపదకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మోదీ అన్నారు. రామ్ లల్లా ఒక టెంట్‌లో ఉండేవాడని, ఇవాళ రామ్‌లల్లాకు ఆలయం ఉవ్వడం జరిగిందని, రామ్ లల్లాకు మాత్రమే కాకుండా దేశంలోని 4 కోట్ల పేద ప్రజానీకానికి పక్కా ఇళ్లు కల్పించామని చెప్పారు. అయోధ్యలో ఈరోజు రూ.15,000 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభమయ్యాయని, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఈ పనులు పూర్తయితే మోడ్రన్ అయోధ్య రూపుదిద్దుకుని దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని అన్నారు. అయోధ్య అభివృద్ధి స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. నేడు భారతదశం పర్యాటక స్థలాల సుందరీకరణతో పాటు డిజిటల్ టెక్నాలజీతో యావత్ ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంటోందని చెప్పారు. అయోధ్య ధామ్ జంక్షన్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌ని ప్రారంభించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆ వాల్మీకి మహర్షిని స్మరించుకుంటారని అన్నారు. అందుకే విమానాశ్రయానికి ఆ మహర్షి పేరు పెట్టామని తెలిపారు. అయోధ్య రైల్వేస్టేషన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాక 70 వేల మంది ప్రయాణించేందుకు అవకాశం లభిస్తుందని వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణాలతో పాటు అభివృద్ధిలోనూ భారత్ దూసుకుపోతోందని స్పష్టం చేశారు. అయోధ్యలో కొత్త టౌన్‌షిప్ నిర్మాణం జరుగుతోందని ప్రకటించారు. తొలి అమృత్ భారత్ రైలు అయోధ్య నుంచే ప్రారంభమవుతుందని వెల్లడించారు. అయోధ్య ధామ్ జంక్షన్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌ని ప్రారంభించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆ వాల్మీకి మహర్షిని స్మరించుకుంటారని అన్నారు. అందుకే విమానాశ్రయానికి ఆ మహర్షి పేరు పెట్టామని తెలిపారు. అయోధ్య రైల్వేస్టేషన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాక 70 వేల మంది ప్రయాణించేందుకు అవకాశం లభిస్తుందని వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణాలతో పాటు అభివృద్ధిలోనూ భారత్ దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఈ రామ మందిర నిర్మాణ అయోధ్య వాసుల కష్టానికి ప్రతిఫలం అని తేల్చి చెప్పారు. దేశ చిత్రపటంలో అయోధ్యను ప్రత్యేకంగా నిలబెడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి అయోధ్య స్ఫూర్తిగా మారనుందని అన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి భక్తుడికీ సులభంగా రాముడి దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్, బ్రిజేష్ పాఠక్ కేశవ్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in